చీకటి వెలుగులు

[కథానిక]

✽

= శ్రీ జి. యస్. సూరి =

శివాలయము కట్టటం పూర్తికాగానే ప్రాకారాలు ప్రారంభించారు. కూలీలు గోడ పునాదులకు ధిమ్మిసా కొడుతూ, ఆదెబ్బలనే తాళంగా చేసి పాట పాడుకొంటున్నారు. అప్పడు దారిచూపుతూఉంటే మిగతావాళ్లు వంత పలుకుతున్నారు.

"కందిరీగనడుముదాన్ని"—
ఎట్టా పోనిత్తురా!
"వాలుచూపుకళ్ల దాన్ని"
ఎట్టా పోనిత్తురా!
"పికిలిపిట్ట గొంతుదాన్ని"
ఎట్టా పోనిత్తురా!
"చింతపువ్వురంగుదాన్ని"
ట్టా పోనిత్తురా!
"అట్టాటిట్టాటిదాన్ని"
ఎట్టా పోనిత్తురా!

ఇంతలో మేస్త్రీ వచ్చి "పన్నెండు కొట్టారు. పని ఆపి అన్నాలకు పాండి" అని కేక వేశాడు; కూలీలు అందరూ పునాదిగోతులనుంచి బయటికి వచ్చి బావిదగ్గరకు వెళ్లారు.

అప్పడు బావిదగ్గరకి వచ్చేసరికి మాలక్ష్మి బుంగతో నీళ్లు పట్టుకుని నిల్చున్నది. ఆపిల్ల నీళ్లు పోస్తూఉండగా చేతులూ, కాళ్లూ కడుక్కొంటున్నాడు అప్పడు.

"ఏం మాలచ్చీ! గానిగెలో నీలు పోశావా?" అన్నాడు.

"ఆ, పోశా. సున్నానికి కుండికూడా కట్టాను." అన్నది.

పైపడ్డతో ముఖం తుడుచుకుంటూ అప్పడూ, కడవ చంకన పెట్టుకుని మాలక్ష్మి బావిదగ్గరనుంచి ప్రక్కగానే ఉన్న మఱ్ఱిచెట్టుకిందకి వెళ్లారు.

చెట్టునీడన కూలీలు అందరూ తలాఒక చోట కూర్చుని అన్నం తింటున్నారు. మర్రిశాఖకు కట్టిన రెండు మూటలు అప్పడు వూడతీసి ఒకటి మాలక్ష్మికి ఇచ్చాడు. ఎవరి మూట వాళ్లు ముందుపెట్టుకొని తినటం మొదలుపెట్టారు.

"ఏం మాలచ్చీ! మీఅన్నను అడిగావా?" అన్నాడు తింటూ.

"అడిగా."

"ఏమన్నది?"

"అప్పన్న నెందుకే సేసుకోటం? ఆడికి ఆ కొంపతప్ప గొడ్డూ గోదా ఏమీ లేదుగెంద. రామయ్య కొడుకు చుబ్బన్నకు ఇయ్యమంటూ మొన్న ఆళ్ల అమ్మ అడిగిపోయిందే అన్నది."

"మరి నువ్వేం సెప్పావు?"

"చుబ్బయ్యన్నా, గిబ్బయ్యన్నా నేను శేసకోను; అప్పయ్యను కాదంటే నాకు ఓరూ అక్కర్లే దన్నాను. అప్పాకు మా అన్న అన్నదిగెందా, మాక మాసం వచ్చిందాకా పెళ్లిసంగతి ఎందుకులే, అప్పుడు సూసుకుందాంలే అన్నది"

"ఊం." అంటూ అప్పయ్య లేచి నిలబడి గిన్నెల్ని తిరిగి మూటకట్టి చెట్టుకు వేలాడేశాడు.

"ఇయ్యాళ నువ్వు నీలు పొయ్యాల్సింది ఏ రమ్మలో?" అని అడిగాడు అప్పడు.

"ఆ శివరిదాంట్లో" అన్నది మాలక్ష్మి.

"అయితే రా; నాలుగుబుంగలు లాగిఇత్తాను, పోసొత్తువుగాని."

"నే సేదుకుంటాలే."

"నీసేతులు నూసుకో ఎట్టా కాయలు కాశినయ్యో. దబ్బున రా; మల్లీ నేను ధిమ్మిసాకు పోవాలి" అన్నాడు.

ఇద్దరూ బావిదగ్గరకు వెళ్లారు. అప్పడు తోడబోతుంటే మాలక్ష్మి తోడుబట్టబోయింది. "అక్కర లేదులే. అవతలఉండ" మని చకచక నీళ్లు లాగి బుంగలకు పోస్తున్నాడు. మాలక్ష్మి రమ్మ నింపింది.

అప్పడు పనిలోకి పోతూఉండగా "ఇయ్యాల్టి నుంచి గుళ్లో దేవుడికి దణ్ణం పెట్టుకోవచ్చుగదూ" అన్నది మాలక్ష్మి.

"ఆ. మంత్రాలూ గింత్రాలూ పొద్దునే అయిపోయెగా."

"అయితే రాత్తిరికి బువ్వ తిని ఈడకు ఒకసారి ఒత్తావా?"

"ఎందుకు?"

"సెపుతాగా"

"సరేలే" అని పునాదులలో దిగాడు.

....

రాత్రి పది కావచ్చింది. గుడిదగ్గర అంతా మాటుమణిగి ఉన్నది. దేవుడిముందు దీపారాధనతప్ప ఆ ఆవరణంలో దీపంగూడా లేదు.

ముందుగా గుళ్లోకి చేరుకున్నాడు అప్పడు. గర్భగుడికి చువ్వల తలుపులు బిగించి ఉన్నవి. నంది విగ్రహాన్ని నిమురుతూ దేవుడివంక చూస్తూ లబడ్డాడు. ఇక్కడికి ఎందుకు రమ్మన్నదీ పాలుపోవటంలేదు.

ఇంతలో మాలక్ష్మికూడ అక్కడికి వచ్చింది. చేతిలో ఒక కొబ్బరికాయా, ఒక చిన్న పొట్లం ఉన్నవి.

"ఏం మాలచ్మి! వచ్చావూ! అయ్యేందుకోయ్?" అన్నాడు.

మాలక్ష్మి ఏమీ మాట్లాడకుండా పక్కగా ఉన్న విభూతితొట్టిలో చెయ్యిపెట్టి ఇంత విభూతితీసి ముఖానికి రాచుకున్నది. చేతిలో ఉన్న చిన్నపొట్లం విప్పి కుంకం తీసి బొట్టు పెట్టుకున్నది. అప్పడుకూడ అదేవిధంగా చేశాడు. నిలుచున్నచోటనే తపీముని కొబ్బరికాయ పగలగొట్టింది. గర్భగుడి మెట్టుమీద ఆ కాయను వుంచి, దణ్ణాపెట్టుతూ నిలబడ్డది. అప్పడుకూడా అట్లాగే ప్రక్కన నిలుచున్నాడు.

"సామీ, బాలకోటీశుడా! నన్నూ నా అప్పడినీ రచ్చించు. నేను ఈ అప్పన్నను తప్ప ఇంకోరిని పెల్లాడను. సత్తెప్రమానంగా సెపుతున్నా. మా అవ్వ మా పెల్లికి ఒప్పుకునేట్లు బుద్ధిపుట్టించు ఓ దేవుడా! శివరాత్తిరికి ముడిపడాలని దీవించు సామీ!" అని మాలక్ష్మి ప్రార్థనచేసింది.

ఇది వినేసరికి అప్పడికి కళ్లలో నీళ్లు తిరిగినవి. వణుకుతున్న గొంతుతో "సామీ! ఈ లోకంలో ఈ మా లచ్మితప్ప నాకు వోరూ లేరు. ఈ మాలచ్మే నాకు ఇంటిది కావాలి. మా మీన దయచూడు భగవంతుడా. మే మిద్దరం నీ గుడి కట్టినోళ్లం. మమ్మల్ని గూడ ఒక ఇంటివోళ్లనుగా సేసి రచ్చించు దేవుడా" అన్నాడు.

ఇద్దరూ చెంపలు వాయించుకుంటూ బయటికి వచ్చారు. గుడిమెట్లమీద కూర్చున్నారు. చెరి ఒక కొబ్బరిచిప్పా తీసుకొని నెమ్మదిగా తిన్నారు. తినటం పూర్తికాగానే బయలుదేరారు. "ఈ గోడకట్టటం ఇంకా ఎన్నాళ్లుపడుతుందో?" అన్నది నడుస్తూ మాలక్ష్మి.

"మళ్లీ వచ్చే అమావసికి పని పూర్తిఅవుద్ది."

"ఆమైన నువ్వు ఇంకేపనికో పోతావు కామాలు"

"రోడ్డుకి దగ్గరగా ఇసుకోలుబడి కడతారంట. మనిద్దరికీ ఆడ పని దొరకొచ్చు."

"ఏమో, ఏం దొరుకుద్దో! నువ్వోసోటా, నేనోసోటా సెయ్యాల్సిఒత్తే ఎట్టాగా అని గుండెలో గుబులుగా ఉంటుంది."

"మన ప్రాప్తం ఎట్లా వుంటే అట్టా జరుగుద్ది. నువ్వుమాత్రం మీఅవ్వకు నచ్చచెపుతూ ఉండు."

"అది నువ్వు చెప్పాలా! ఇక నేను ఇంటికి పోతా"అన్నది.

ఒక నిమిషంసేపు ఇద్దరూ మాట్లాడకుండా నిలబడ్డారు. "సరే ఎల్లు"అన్నాడు అప్పడు. ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయినారు.

....

శివుడి గుడిపని పూర్తికాగానే ఆవూళ్లో జిల్లా బోర్డుమిడిల్‌స్కూల్‌బిల్డింగు కట్టటం మొదలు పెట్టారు. అనుకొన్నట్లుగానే అప్పడిక్కీ, మాలక్ష్మికీ అక్కడ పనిదొరికింది. ఎప్పటిమాదిరి ఆడుతూ పాడుతూ ఒకరి కొకరు చేదోడువాదోడుగా కూలిచేస్తున్నారు.

మూడునెల లయేసరికి గోడలు పైకిలేచినవి. పైన కప్పు వేయటంవరకూ వచ్చింది. కలపదూలాలు వేసి లాజు ఆతికే పద్ధతికాకుండా సిమెంటుకాంక్రీట్ స్లాబ్ వెయ్యవలెనని నిశ్చయించారు. అందుకోసం కంట్రాక్టరు కాంక్రీట్ మిక్సింగ్ మెషినును తీసుకొని వచ్చాడు. ఆ మిషనులో కంకర, సిమెంటు, ఇసుక, నీళ్లు, కొన్నిపాళ్లాలలో పోసి, ఆమొత్తాన్ని ఇంజను సహాయంతో పాకానికి వచ్చేదాకా మథించుతారు. ఈ తయారైన కాంక్రీటుముద్దను బొచ్చెలతో పైకి తీసుకొనిపోయి గోడలమీద అచ్చుగా పోస్తారు. అప్పడికి ఈ కంకరబొచ్చెలు చేరవేసే పని ఇచ్చారు. మాలక్ష్మిని కాంక్రీట్ మిక్సర్‌లో నీళ్లుపోసే కూలీలలో ఒకతెనుగా నియమించారు.

వీరాసామి కాంక్రీట్ మిక్సర్ ఇంజనుకు డ్రైవరు. కేవలం బస్తీమనిషి. మెషీను స్టార్టుచెయ్యగానే కూలీలందరూ చుట్టూ మూగేవాళ్లు. అంతకు పూర్వం ఇటువంటి యంత్రం ఆవూరికి ఎప్పుడూ రాకపోవటాన అందరికీ చోద్యంగా ఉన్నది. నలుగురూ చూస్తూంటే వీరాసామికి అతిశయంగా ఉండి కత్తెరగిరజాలు ఆడిస్తూ, కోరమీసం సర్దుకుంటూ పటాటోపం చూపటం మొదలుపెట్టాడు. అదీగాక తక్కిన కూలీలు చొక్కాలంటూ లేకుండా, మూటలతో అన్నంతెచ్చుకొని తింటూ, బీడీలో చుట్టలో కాల్చుకుంటూ, లల్లాయిపదాలు పాడుకొంటూ పనిచేస్తుంటే వీరాసామి ఖాకీగుడ్డలు తొడుక్కొని, దసరాసిగరెట్లు కాలుస్తూ, పింగాణీటిఫిన్‌కారియరులో అన్నం తెచ్చుకొని తింటూ, సినిమాపాటలు పాడుతూ, ఆ మాయయంత్రాన్ని ఆడించుతుండేవాడు.

ఆ ఇంజనుదగ్గర పనిచేసే కూలీలుకూడ మాఅంత వాళ్లు లేరన్నట్టు ప్రవర్తించేవాళ్లు. మధ్యాహ్నం పూట అన్నం తింటూ, చుట్టూ కూలీలందరినీ కూర్చోపెట్టుకొని వీరాసామి తాను చిన్నప్పుడు ఇంటిదగ్గర నుంచి పారిపోయి రంగూను ఎట్లా వెళ్లిందీ, అక్కడ హార్బరులో పనిచేయటమూ, ఆ స్టీమర్ల రాకపోకలూ, బర్మాదేశపు ప్రజల ఆచారవ్యవహారాలూ, ఆకాశంలో తిరిగే విమానాలూ, సినిమాకంపెనీలూ మొదలైన అపరూపవిషయాలనుగురించి ఒడుపుగా డచ్చీలు కొట్టుతూ ఉంటే అందరూ నోరుతెరిచి వినేవాళ్లు. వాళ్లల్లో ఈ మాలక్ష్మి ఒకతె.

ఈ కాంక్రీట్ మిక్సరూ, వీరాసామీ అక్కడికి వచ్చిన తరువాత మాలక్ష్మిలో కొంత మార్పు జరగటం మొదలయింది. ఒక్కపూట అయినా అప్పడిని చూడకుండా ఉండలేని మనిషి కాస్తా మధ్యాహ్నం పూట అన్నానికికూడ అతడికోసం ఎదురుచూడకుండా ఇంజనుదగ్గర కూలీలతోపాటు కూర్చోటం సాగించింది. అప్పడు అలవాటుచొప్పున ఏదైనా పనిలో సహాయం చెయ్యవస్తే నిరసనగా అక్కర్లేదని పంపేది. సాయంత్రంపూటకూడ వాడితో మంచీ చెడ్డా చెప్పుకోటం

క్రమంగా తగ్గించి తక్కిన కూలీలతోపాటు చీకటిపడ్డదాకా వీరాసామి చెప్పే రంగూన్ మజిలీకథలను వింటూ కూర్చుని సరాసరి ఇంటికి వెళ్ళేసి.

ఇదంతా చూస్తూంటే అప్పన్నకి మనసు చివుక్కుమన్నది. మహాలక్ష్మి ప్రవర్తనవిషయంలో సంపూర్ణమైన విశ్వాసం ఉన్నప్పటికీ కష్టంగా మాత్రం తోచేది. కాని హృదయంలోని భావాలను తేలికగా వెలిబుచ్చే తరహావాడు కాడు అప్పన్న. కొత్తను చూస్తే వింత ఉండడం అందరికీ సహజమేలేనని సమాధానపరచుకొనేవాడు.

గోడలమీదికి ఎక్కి కంకర అందిస్తూ అనుకోకుండా ఇంజనువైపుకు చూసేవాడు. ఆ సమయంలో మాలక్ష్మి నవ్వుతూ మాట్లాడుతూ ఉంటే కుమిలిపోయేవాడు. ఎప్పుడూ తక్కిన కూలీలను తన పాటలతోనూ, మాటలతోనూ నవ్వుతూ నవ్విస్తూ ఉండేవాడు క్రమంగా మారిపోయి వాడిన ముఖంతో తలవంచి పని చేసుకోటం ప్రారంభించాడు.

ఒకనాటి మధ్యాహ్నం అప్పన్న త్వరగా చెట్టుక్రింద అన్నం తిన్నాడు. వీరాసామి కూర్చున్న ముఠాదగ్గరకు వచ్చి దూరంగా చతికిలపడ్డాడు. ఆ షోకుదారుడు ఏదో సినిమా కథ చెపుతున్నాడు. "......ఆ వనదేవతను ఒక చెట్టుకింద కూసోపెట్టి కోయవాళ్లంతా చుట్టూ చిందులు తొక్కుతున్నారు. అప్పుడు ఆ వనదేవత సరిగ్గా ఆ పిల్లమాదిరి కూసుని ఉంది..." అని మాలక్ష్మిని చూపించాడు. అందరూ నవ్వారు. మాలక్ష్మి సిగ్గుతో తలవంచుకుంటూ మందహాసం చేసింది. ఈ దృశ్యం చూసేటప్పటికి అప్పన్నకి తారామండలంగా మండిపోయింది. ఏదో వేషాలేసే మనిషితో తన మాలక్ష్మిని పోల్చినందుకు వీరాసామిని గొంతుపట్టుకొని నులిమివేద్దా మనుకున్నాడు. ఇందుకు వాడిని అంటే ప్రయోజనమేమిటిలే అని ఊరుకొన్నాడు. అక్కడినుంచి చర్రున లేచిపోయినాడు.

ఆ సాయంత్రం కూలీలు అందరూ ఇళ్లకు పోబోయేటప్పుడు "మాలచ్మీ!" అని పిలిచాడు అప్పన్న.

"ఆఁ" అన్నది మాలక్ష్మి.

"నేనుకూడ మీ ఇంటిదాకా వస్తున్నాను, ఆగు."

"ఎందుకూ?"

"నిన్నొకటి అడగాలి."

"ఆ అడిగేదేందో ఇప్పుడే సెప్పరాదూ ?"

ఇద్దరూ నడుస్తున్నారు. రెండునిమిషాలు పస్తాయించి అప్పన్న అందుకొన్నాడు:

"నువ్వు మునుపటిమల్లే ఉండడం లేదు ఎందుకని ?"

"సచ్చేదాకా ఒకటేయినంగా ఉంటారా యేం ?"

"అవును. ఉండరులే—అయితే మన పెళ్లి మాట మీఅవ్వ ఏమైనా తేల్చిసెప్పిందా ?"

"నేను మళ్లీ అడిగితేగందా !"

"ఏం ?"

"ఏమీ లేదు. ఉప్పుడేం తొందర ?"

"మాకమాసం వస్తున్నదిగా"

"మళ్లీ రాదా యేం ?"

"నీకేం దెయ్యం పట్టలేదుగందా ?"

"పట్టిన దెయ్యం వదిలిందేమో."

"ఊఁ...సరే......అయితే......దేవుడిదగ్గరి పెమానంకూడా మరసిపోతూ వన్నమాట !"

"అయ్యనీన్ని ఉప్పుడెందుకూ! నేను ఎల్తా."

అని మాలక్ష్మి గబగబా వెళ్లిపోయింది. అప్పన్న దిగాలుబడి నిలబడ్డాడు. ఆరోజునుంచి మాలక్ష్మిని పలకరించటానికికూడ ప్రయత్నించలేదు. గుండె రాయిచేసుకున్నాడు.

....

మూడు వారాలు గడిచినవి. ఒకరోజు పొద్దున్నే కూలీలు పనిలోకి వెళ్లేటప్పటికి అక్కడ కాంక్రీట్ మిక్సరు కనబడలేదు. ఆ కిందటిరాత్రి కంట్రాక్టరు

దానిని ఇంకో ఊరికి పంపా డన్నారు. దానితో పాటు వీరాసామికూడా ఎట్లా వచ్చాడో అట్లాగే వెళ్లిపోయి నాడు. అదివరదాకా ప్రతిపూటా వాడిచుట్టూ చేరి, కబుర్లు వింటూ ఆనందించిన కూలీలే వీరాసామిని క్షణంలో మరచిపోయినారు. "చెప్పిఅయినా పోలేదు, వట్టి దగారిపోచికోలు"అన్నారు. మాలక్ష్మి ఏమను కొంటున్నదీ ఎవ్వరికీ తెలియలేదు. మూకీభావంగా మాత్రం కనబడేది.

స్కూలుబిల్డింగు చాలావరకు పూర్తిఅయింది. చక్కసున్నం చెయ్యటం మొదలుపెట్టారు. మాలక్ష్మిని తిరిగి గాబుగదగ్గర నీళ్లు పోయమన్నారు. అప్పడు సున్నపుబొచ్చెలు జేరవేస్తున్నాడు. ఎవరికి వారు యథోచితంగా ప్రవర్తిస్తూ, మాట్లాడేందుకైనా ప్రయత్నించటం లేదు. తక్కిన కూలీలకు ఇది ఆశ్చర్యంగా ఉండేది.

ఆనాడు మాలక్ష్మి, తానూ కలిసి గుళ్లో కొబ్బరి కాయ కొట్టినప్పటినుంచి అప్పన్న ప్రతిరాత్రీ అదే సమయానికి ఆ శివాలయానికి వెళ్లేవాడు. దేవుడికి దణ్ణం పెట్టుకొని కాసేపు ఒంటరిగా అక్కడ జాగారం చేసి వస్తూఉండేవాడు. ఆవిధంగానే ఆరోజునకూడ గుడికి వెళ్లాడు. నందిదగ్గరకు వెళ్లేటప్పటికి గుడిచువ్వల తలుపులనుండు ఎవరో కూర్చొని ఏడుస్తున్నట్లు కనిపించింది. ఎవరా అని పరికించి చూశాడు. మాలక్ష్మి! నిజంగా మాలక్ష్మి! కాళ్లు తేలిపోయినవి. ఆ నంది విగ్రహానికి చేరగిలబడి తానూ ఒక శిలాప్రతిమవలె నిలబడిపోయినాడు. మాలక్ష్మి ఏదో మాట్లాడు తున్నది......

"సామీ, బాలకోటేసుడా! నేను ఏం పాపం చేశాను? ఎందు కిట్టా ఏడిపిస్తున్నావు నన్ను? నా అప్పడికీ, నాకూ ఇంతదూరం సేశావు ఎందుకని? ఏదో మైకంలో పడ్డా. ఆ పోసికోలుకబుర్లు ఇంటుంటే నా అప్పడుకూడ ఒక మనిసేనా అనుకున్నా. సిన్నిసూపు సూశా అప్పణ్ణి. నా మణుసు నాకు తెలియక కారుకూతలు కూశా. ఆఖరికి నీదగ్గిర సేసిన పెమానంకూడ మరచిపాయ్యా. ఓ దేవుడా, నాగుండె పగుల్తుంది.—అయ్యో నా అప్పన్నా! అప్పన్నా" అంటున్నది.

ఇదంతా వింటున్న అప్పన్నకు కలగంటున్నట్టు తోచింది. తన పేరు పిలిచేసరికి అప్రయత్నంగా "ఆఁ" అన్నాడు.

మాలక్ష్మి ఉలిక్కిపడి వెనుకకు తిరిగిచూసింది. అప్పడా! అప్పడేనా? కళ్లు నులుముకుని మళ్లీ చూసింది.

ముందుకు అడుగు ఎవరు మొదట వేశారో చెప్పటం కష్టం. క్షణంలో అప్పన్నగుండెమీద తల వుంచి వెక్కివెక్కి ఏడుస్తున్నది మాలక్ష్మి. అప్పడికి కన్నీళ్లు వరదలై మాలక్ష్మి తలనిండా రాలుతున్నవి. ఒక్కరూ మాట్లాడలేదు......

మాఘమాసం రాగానే ఇద్దరికీ పెళ్లిఅయింది.